ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్‌

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో 5 రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, శ్రీనివాస గద్యమ్‌ పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, తులసీ రమణాచార్యులు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్‌, సునీత, మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌, ఈవో రవీందర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు.

పండ్ల పంపిణీ

బోడుప్పల్‌: బృందావన్‌ కాలనీలోని జేజీఆర్‌ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేసి వారితో ఆనందంగా గడిపారు.

నేడు ఉప్పల్‌కు గవర్నర్‌

ఉప్పల్‌: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి తెలంగాణ మార్కెటింగ్‌ డిస్ట్రిబ్యూషన్‌ వేర్‌ హౌజ్‌ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సర్జికల్స్‌ షట్టర్‌ నోయిడా ఉప్పల్‌లో నేడు ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌.రాంచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ హాజరుకానున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు పుప్పాల వెంకటేశ్వర్లు ప్రకటించారు.

మెట్రో స్కైవాక్‌పై ట్రాఫిక్‌

ఉప్పల్‌: మెట్రో స్కైవాక్‌పై ప్రయాణించే వారు పీక్‌ అవర్స్‌లో రోజుకు 30 నుంచి 35 వేలకు వరకు ఉంటారని అంచనా. కాగా అది కాస్తా రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా రోజూ మూడింతలు అనగా దాదాపుగా 90 వేలకు పైగా ప్రజలు మెట్రోను వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉప్పెనలా ట్రాఫిక్‌ !

ఉప్పల్‌లో కొట్టొచ్చినట్లుగా ట్రాఫిక్‌ వైఫల్యం

- స్తంభించిన వరంగల్‌ జాతీయ రహదారి
- రాఖీ సందర్భంగా తప్పని ట్రాఫిక్‌ తిప్పలు



ట్రాఫిక్‌తో స్తంభించిన వరంగల్‌ జాతీయ రహదారి



ఉప్పల్‌: రాఖీ పండుగ సందర్భంగా ఉప్పల్‌ వైపు వచ్చిన వాహనాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉప్పల్‌ చౌరస్తా నుంచి ఎటుచూసినా కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌తో వాహనాలు బారులు తీరాయి. వరంగల్‌ జాతీయ రహదారితో పాటు ఉప్పల్‌ చౌరస్తా నుంచి మొదలుకుని అటు వైపు నాగోల్‌ వరకు, మరో పక్క మేడిపల్లి వరకు, ఇటు హబ్సిగూడ నాచారం, రామంతాపూర్‌, తార్నాక, మల్లాపూర్‌ వరకు శనివారం ఉదయం నుంచే తీవ్రంగా ట్రాఫిక్‌ స్తంభించిపోయి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్‌ కొనసాగింది.

గతంలో ఎన్నడూ లేని విధంగా...

గతంలో ఏ పండుగకు లేనంతగా రాఖీ పండుగకు జనం భారీ ఎత్తున వాహనాలతో రోడ్లపైకి రావడం, చుట్టూ మున్సిపాలిటీలు, గ్రామాల నుంచి వాహదారులు ఉప్పల్‌ వైపు ఉప్పెనలా వచ్చి పడ్డారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. దసరా పండుగ, సంక్రాంతి పండుగ, ఇతర పండుగలు వచ్చినా ఇంత ట్రాఫిక్‌ సమస్య ఉత్పన్నం కాలేదు.

ప్రణాళిక లేని ట్రాఫిక్‌ అధికారులు..

ఉప్పల్‌ గతంలో మునుపెన్నడూ ఇంత పెద్ద ఎత్తున ట్రాఫిక సమస్య ఏర్పడటం లేదు. అందుకు కారణం పూర్తిగా ట్రాఫిక్‌ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. గతంలో ఉన్నట్లు ఇప్పుడు ఉప్పల్‌ ట్రాఫిక్‌ స్టేషన్‌ పరిధి తగ్గినా ట్రాఫిక్‌ భారీ ఎత్తున స్తంభించడంపై ఉన్నతాధికారులు సైతం కన్నెర్ర చేసినట్లు సమాచారం.

విధుల్లో 150 మందికి పైగా పోలీసులు..

ఉప్పల్‌ ట్రాఫిక్‌కు ముగ్గురు ఇన్‌స్పెక్టర్‌లతో పాటు దాదాపుగా 154 మంది ట్రాఫిక్‌ సిబ్బంది నిత్యం విధుల్లో ఉంటారు. వీరంతా ఏమయినట్లని పలువురు ప్రశ్నిస్తున్నారు. వరంగల్‌ జాతీయ రహదారితో పాటు ఏ గల్లీలో చూసినా ట్రాఫిక్‌ స్తంభించిపోవడం కనిపిస్తోంది. కొన్నిచోట్ల స్థానికులే స్వయంగా కార్లు, ద్విచక్ర వాహనాలు దిగొచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నా.. ఫలితం లేకుండా పోయింది.

అంబులెన్స్‌లూ విలవిల..

ఉప్పల్‌ ట్రాఫిక్‌ వలయంలో అంబులెన్సులు సైతం చిక్కి కుయ్‌.. కుయ్‌.. మంటూ అరిచినా వాటికి దారిచ్చే వాడే కరువయ్యాడు.

పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించుకోవాలి



ఉప్పల్‌ నుంచి ఘట్‌కేసర్‌ రోడ్డు మరమ్మతుల కారణంగా పరిస్థితి చేయి దాటింది. రాఖీ పండుగకు తోడు ఆదివారం వరుస సెలవులు రావడంతో ఇటు గ్రామాలకు వెళ్లే వారు, మహిళలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకుని అడిషనల్‌ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది ట్రాఫిక్‌ నియంత్రణలో నిమగ్నమయ్యాం. సాధ్యమైనంత వరకు ప్రజలు పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్టును వినియోగించుకోవాలి.

– మనోహర్‌, ఇన్‌చార్జ్‌ డీసీపీ మల్కాజిగిరి

బోనాలకు అమ్మవారి ఆలయం ముస్తాబు



గౌతంనగర్‌: నేడు లక్ష్మీనృసింహస్వామినగర్‌ బోనాలు వైభవంగా జరుగనున్నాయి. అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా విద్యుత్‌ కాంతులతో ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్చిదిద్దారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి జేఎల్‌ఎన్‌ఎస్‌నగర్‌, న్యూ వేంకటేశ్వరనగర్‌, తుకారాంగేట్‌ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించడానికి వేలాదిగా తరలివస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పలహారాల బండి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

మైనంపల్లికి ఆహ్వానం..

జేఎల్‌ఎన్‌ఎస్‌నగర్‌లో ఆదివారం జరిగే బోనాల జాతరకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు. కాంగ్రెస్‌ నేతలు వెంకటేష్‌యాదవ్‌, ప్రవీణ్‌, పరమేష్‌, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ అనంతసరస్వతీనగర్‌ నుంచి మౌలాలి జెట్టీసీ మీదుగా నాలా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నేతలు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ సీనియర్‌ నేతలు బక్క నాగరాజు, నర్సింహగౌడ్‌లు మాట్లాడుతూ.. మల్కాజిగిరి గ్రామంగా ఉన్నప్పుడు గొలుసు కట్టు చెరువులుగా రామక్రిష్ణాపురం (ముక్కిడి చెరువు) సఫిల్‌గూడ చెరువు (నడిమి చెరువు), బండచెరువు ఉండేవన్నారు. ప్రస్తుతం చెరువులు కబ్జాకు గురై కుచించుకుపోయాయన్నారు. ప్రస్తుతం చిన్నపాటి వర్షానికి ముక్కిడి చెరువు, సఫిల్‌గూడ చెరువుల నుంచి బండచెరువులోకి నీరు చేరి దిగువ కాలనీలు ముంపునకు గురవుతున్నాయని ఎంపీకి వివరించామన్నారు. గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసినా అధికారులు సుముఖంగా లేకపోవడంతో నాలా నిర్మాణం జరగలేదన్నారు. సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించారన్నారు. హరిరాజు, రఘు తదితరులున్నారు.

ఖోఖోలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ శ్రీలత, వైస్‌ ప్రిన్సిపాల్‌ రమాదేవి

ఘట్‌కేసర్‌: ఖోఖో చాంపియన్‌షిప్‌లో అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్‌ ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. జూలై 31, ఆగస్టు 1 వరకు హైదరాబాద్‌ ఎల్‌బీస్టేడియంలో జరిగిన అండర్‌– 19 తెలంగాణ రాష్ట్ర ఖోఖో చాంపియన్‌షిప్‌–25లో అంకుషాపూర్‌లోని గురుకుల ఆర్మీ మహిళా కళాశాల విద్యార్థిని రుక్మిణి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన అభినందన సభలో హెచ్‌ఆర్‌ కంపెనీ ప్రతినిధులు (అమెరికా) విద్యార్థినికి రూ. 50 వేల బెస్ట్‌ డిఫెండర్‌ నగదు అవార్డును అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీలత, వైస్‌ ప్రిన్సిపాల్‌ రమాదేవి, పీడీ స్వప్న, ఆర్మీ శిక్షకులు, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

కంకర తేలిన రోడ్డు.. రాకపోకలకు ఇబ్బందులు

నాగోలు: నాగోలు డివిజన్‌ పరిధిలోని జైపురి కాలనీ చౌరస్తా నుంచి కల్యాణ లక్ష్మి గార్డెన్‌ వరకు గతంలో జలమండలి అధికారులు వరద నీటి పైప్‌లైన్‌ కోసం రోడ్డు తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో మరమ్మతు చేయకుండా మట్టి పోసి వదిలేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై ఉన్న మట్టి మొత్తం కొట్టుకుపోవడంతో కంకర తేలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేయాలని జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే రోడ్డుపై నడవలేని దుస్థితి ఉందని భారీ వర్షం కురిస్తే ఉన్న రోడ్డు మొత్తం ధ్వంసమవుతుందని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ముంపు సమస్యను పరిష్కరించండి



స్థానికులతో కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌

మల్కాజిగిరి: ముంపు సమస్యను పరిష్కరించాలని ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌కు దుర్గానగర్‌, దొడ్ల బస్తీ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. శనివారం పలు కాలనీల్లో కార్పొరేటర్‌ పర్యటించగా.. డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎగువ కాలనీల్లో బాక్స్‌ డ్రెయిన్‌ నిర్మాణం కారణంగా నీరు సాఫీగా ప్రవహించి దిగువ ప్రాంతంలో ఉన్న తాము ఇబ్బందులకు గురౌతున్నామన్నారు. డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలని కోరారు. త్వరలోనే అధికారులతో పర్యటించి తగిన ప్రణాళికలు సిద్ధం చేసి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రజనీకాంత్‌, సత్యమూర్తి, బాబు, బ్రహ్మయ్య, మోసిన్‌, నర్సింహారెడ్డి, జాలయ్య, రాము, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన



ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్‌: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉప్పల్‌ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జ్యోతిర్మయి తెలంగాణ నాట్య కళామేళం కళాకారుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి. విఘ్నేశ్వర వందనం, వందనం వందనం భారతావని, హర హర శంకర, స్వర నర్తనం, గురు బ్రహ్మ, కృష్ణయ్య గోపాల తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌కు తప్పని తిప్పలు !

శివారుల్లో ఆలస్యంగా లే అవుట్‌ రెగ్యులరైజేషన్‌ స్కీమ్‌ ప్రొసీడింగ్స్‌	ఆర్జీలకు కొర్రీలతో నెలల తరబడి ఆఫీస్‌ల చుట్టూ ప్రదక్షిణలు	మొత్తం దరఖాస్తులు 1.64 లక్షలు.. పరిష్కారమైనవి 1.02 లక్షలు	ముప్పు తిప్పలు పెడుతున్న మూడు లాగిన్లు

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: జిల్లాలో లేఅవుట్‌ రెగ్యులరైజేషన్‌ స్కీమ్‌ (ఎల్‌ఆర్‌ఎస్‌) ప్రొసీడింగ్స్‌ చాలా ఆలస్యమవుతున్నాయి. దీంతో దరఖాస్తుదారులు నెలల తరబడి సంబంధిత పురపాలక సంఘాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు చూస్తామని చెప్పడం మినహాయించి ప్రక్రియ ముందుకు కదలడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. పుర కమిషనర్లు ఆదేశించినా.. టౌన్‌ప్లానింగ్‌ విభాగం తీరుమారడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు పురపాలక సంఘాల్లో పూర్తిస్థాయి టౌన్‌ ప్లానింగ్‌ అధికారి లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒకే అధికారి 2–3 పురపాలక సంఘాలకు ఇన్‌చార్జ్‌

ఒకే అధికారికి అదనంగా 2–3 పురపాలికలను అప్పగించడంతో పనుల్లో జాప్యానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో నగర శివారు మున్సిపల్‌ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆదాయం రాబట్టుకోవడానికి ప్రభుత్వం ఇటీవల 25 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించగా.. ఎలాంటి వివాదం లేని దరఖాస్తులకు మోక్షం లభించగా.. మరికొన్నింటికీ కొర్రీలు తప్పకపోవటంతో దరఖాస్తుదారులు నెలల తరబడి సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. పరిష్కారానికి నోచుకోవటం లేదని పేర్కొంటున్నారు.

తప్పని కొర్రీలు

లే అవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారుల నుంచి సంబంధిత పురపాలక సంఘాలు రూ. వేలల్లో ఫీజు వస్తోంది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకొస్తున్నప్పటికీ ఆ దరఖాస్తుల పరిష్కారానికి రకరకాల కొర్రీలు చూపుతుండటంతో నానా అవస్థలు పడుతున్నారు. అభ్యంతరాలను పరిష్కరించుకోవడానికి కొందరు రిజిస్ట్రేషన్‌, ఇరిగేషన్‌, రెవెన్యూ, పురపాలక సంఘాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లోనే పెండింగ్‌..

హైదరాబాద్‌ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ తర్వాత అత్యధిక ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 1.64 లక్షలు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 1.02 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాగా, వాటికి తగినట్లుగా ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుదారులు రుసుము కూడా చెల్లించారు. నగదు చెల్లించే వరకు పోన్లు చేసి మరీ ఆరా తీసిన అధికారులు ప్రొసీడింగ్‌ కాపీలు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కాపీలు ఇచ్చేందుకు కూడా వెనుకడుగు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులు సమీక్షించడం లేదనే విమర్శలున్నాయి.

మూడు లాగిన్‌లతో అవస్థలు

ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తు ప్రాసెసింగ్‌ కోసం 3 లాగిన్లు కేటాయించారు. 3 విడతల్లో దరఖాస్తుల క్రమబద్ధీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుదారులు అన్ని పత్రాలతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌ చేసిన తర్వాత ఎల్‌–1 అధికారికి వెళ్తున్నాయి. ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన, పత్రాలు అప్‌లోడ్‌ చేసిన తర్వాత ఎల్‌–2కి వెళ్తున్నాయి. ఎల్‌–2లో ఫీజు మదింపు జరగాల్సి ఉండగా.. వీరి లాగిన్‌లో మళ్లీ ఎల్‌–1 పెండింగ్‌ అని చూపుతున్నాయి. అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులకు సంబంధించి ఫీజు చెల్లించిన వారిలో కొందరికి ఐజీఆర్‌ఎస్‌ పెండింగ్‌ సూచిస్తోంది. ఫీజు చెల్లించిన తర్వాత ఇరిగేషన్‌, రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌ శాఖ నుంచి పత్రాలు తీసుకొచ్చి అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటోంది. ఈ ప్రక్రియ పూర్తయితే మళ్లీ ఎల్‌–1 పెండింగ్‌ వస్తుంది. ఫీజు కట్టిన దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అసలే కనిపించడం లేదని తెలుస్తోంది. అవి ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా దరఖాస్తుదారుడు, లాగిన్‌ అధికారికి తెలియడం లేదు.

వృద్ధుడి అదృశ్యం



పూర్ణచందర్‌రావు

కుషాయిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్‌ కాలనీకి చెందిన కొడాలి పూర్ణచందర్‌రావు (80) ఇంట్లోనే ఉంటున్నాడు. కాగా కుటుంబసభ్యులు పెళ్లి పనుల్లో నిమగ్నమైన సమయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన వారు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామలింగేశ్వరుడి సేవలో సీబీఐ డీఐజీ

కీసర: కీసరగుట్టలోని రామలింగేశ్వరస్వామిని సీబీఐడీఐజీ శివసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన కుటుంబసభ్యులకు ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగాపేట్‌ బషీర్‌బాగ్‌ డీసీపీ కోటిరెడ్డి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

పండగ వేళ.. ప్రయాణికుల అవస్థలు !



మేడ్చల్‌ బస్‌ డిపోలో ప్రయాణికుల రద్దీ

మేడ్చల్‌రూరల్‌: రక్షాబంధన్‌ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రయాణికులకు సరిపడ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం బారులు తీరాల్సి వచ్చింది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడం, వరుస సెలవులు, పండగ ఉండటంతో ప్రజలు పెద్దఎత్తున బంధువుల ఇళ్ల బాట పట్టడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. మేడ్చల్‌ డిపో నుంచి నగరం, పలు జిల్లాల సరిహద్దులకు మేడ్చల్‌ నుంచి వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి.

అనుబంధాలకు ప్రతీక
రక్షాబంధన్‌



మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్‌ సునీత



ఎంపీ ఈటలకు రాఖీ కట్టిన చిన్నారి శ్లోక నందిని

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం పలువురు ప్రజా ప్రతినిధులకు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాఖీ పండుగ అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడు, తోడబుట్టిన వారి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగ రక్త సంబంధాన్ని బలోపేతం చేస్తుందని పలువురు వివరించారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం



సోదరుడికి రాఖీ కడుతున్న చిన్నారి



పోలీసులతో సరస్వతీ శిశుమందిర్‌ విద్యార్థులు



కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌ దంపతులకు రాఖీ కడుతున్న మహిళలు



ఎస్సై మైబెల్లికి రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుళ్లు



రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వజ్రేష్‌యాదవ్‌, చెన్నప్ప



కార్పొరేటర్‌ ప్రభుదాస్‌తో పారిశుద్ధ్య కార్మికులు



నందికంటి శ్రీధర్‌కు రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్‌ మహిళ నాయకురాళ్లు